నాగావళి నదిలో పెరిగిన నీటి ప్రవాహం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని నాగావళి నదిలో శనివారం నీటి ప్రవాహం పెరిగింది. ఎగువున ఉన్న ఒడిశాలో వర్షాలు కురవడంతో మన్యం జిల్లా గరుగుబల్లి మండలంలో గల తోటపల్లి ప్రాజెక్టులోకి నీరు ఎక్కువగా చేరింది.దీంతో అప్రమత్తమైన అధికారులు కొన్ని గేట్లు ఎత్తివేసి నీటిని విడిచి పెట్టారు. దీంతో నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. అయితే ఇంతవరకు నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉండటంతో నాగావళి నదికి ఇవతల విజయనగరం జిల్లాలో గల కొన్ని మండలాలు ప్రజలు, నదికి అవతల వైపున ఉన్న మన్యం జిల్లాలో గల కొన్ని మండలాల ప్రజలు వంగర మండలంలోని శివ్వాం, ఓని అగ్రహారం, తలగాం రేవులు వద్ద రాకపోకలు సాగించేవారు. నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

చెరకు రైతులకు చేదు కబురు

- పెట్టుబడితో సంబంధం లేకుండా రూ.10 పెంపు
- గొప్పగా చెప్పుకుంటున్న కేంద్రం
- చెరకు పాలసీని పునరుద్ధరించని రాష్ట్ర ప్రభుత్వం

చెరకు రైతులకు మరోసారి చేదు అనుభవం ఎదురైంది. ఇప్పటికే సహకార రంగంలోని చక్కెర కర్మాగారాలను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా మూసివేసివేస్తుండగా, కేంద్ర ప్రభుత్వం ఉత్పాదక వ్యయంతో సంబంధం లేకుండా క్వింటా చెరకుపై రూ.10 పెంచి, దాన్నే గొప్పగా చెప్పేసుకుంటోంది. దీంతో, చెరకు రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో మరోసారి మోసపోయినట్లైంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలో ఒకప్పుడు 5లక్షల ఎకరాల విస్తీర్ణంలో చెరకు సాగయ్యేది. సుమారు 29 సుగర్ ఫ్యాక్టరీల్లో క్రషింగ్ చేసేవారు. చెరకు సాగుకయ్యే పెట్టుబడులతో సంబంధం లేకుండా కేంద్రంలోని పాలకులు మద్ధతుధర నిర్ణయించడం, 2002లో అప్పటి సిఎం చంద్రబాబు చెరకు పాలసీని రూపొందించే స్టేట్ అడ్వైజరీ కమిటీని రద్దుచేయడం వంటి కారణాల వల్ల రైతులకు ఆర్థికంగా కుదేలవుతూవచ్చారు. దీంతో, క్రమంగా ప్రస్తుతం చెరకు విస్తీర్ణం క్రమంగా 1.50లక్షల ఎకరాలకు తగ్గింది. సామర్థ్యానికి అనుగుణంగా చెరకు ఉత్పత్తులు లేకపోవడంతో చాలా వరకు చెక్కెర కర్మాగారాలు మర్మతులకు గురయ్యాయి. ఆధునీకరణ పేరుతో విజయనగరం జిల్లాలోని భీమసింగి విజయరామగజపతి సహకార చెక్కెర కర్మాగారం సహా పలు కర్మాగారాలను ప్రభుత్వాలే మూసివేశాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా విజయనగరం జిల్లా సంకిలి సహా నాలుగు కర్మాగారాల్లో మాత్రమే చెరకు క్రషింగ్ జరుగుతోంది.

ఈ సంగతి కాస్త అటుంచితే.... పెరిగిన పెట్టుబడుల ఆధారంగా క్వింటా చెరకుకు రూ.10చొప్పున మద్ధతు ధర కల్పించనున్నట్టు కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవ్యా, అనురాగ్‌సింగ్ ఠాగూర్ ఇటీవల ప్రకటించిన విషయం విధితమే. ఇందులో హేతుబద్ధత లేదని రైతులు, ఎపి రైతు సంఘం, చెరకు రైతుల సంఘం నాయకులు చెబుతున్నారు. మంత్రుల ప్రకటన ప్రకారం 2023-24 టన్ను క్రషింగ్ సీజన్‌లో టన్ను చెరకు రూ.3150 చొప్పున కొనుగోలు చేస్తారు. వాస్తవానికి ఇంతకు మించి రైతులకు పెట్టుబడులు అవుతున్నాయి. ఈ ధర నిర్ణయించే సమావేశంలోనే యూరియాపై రూ.24, పొటాష్, డిఎపి బస్తాలపై రూ.50చొప్పున పెంచేందుకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం చేసింది. పెరిగిన డీజిల్ ధర వల్ల ట్రాక్టర్ అద్దె గతంతో పోలిస్తే రూ.200 పెరిగింది. కూలి రేట్లు కూడా అమాంతంగా పెరిగిపోయాయి. ఈ లెక్కన ప్రాంతాలు, నీటి వసతులను బట్టి దుక్కి, విత్తనం, గొప్పులు, ఎరువులు, బోదులు కట్టడం, నీరుపెట్టడం, కూలి తదితర రూపాల్లో ఎకరాకు రూ.30వేల నుంచి రూ.60వేల వరకు పెట్టుబడి అవుతుంది. మరోవైపు రవాణా ఛార్జీలు కూడా గతంలో పోలిస్తే బాగా పెరిగిపోయాయి. వ్యవసాయ రుణాలపై ఆర్‌బిఐ 5శాతం వడ్డీ రేట్లు పెంచింది. ఈనేపథ్యంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సి2 ప్లస్ 50శాతం ఫార్మలా ప్రకారం చెరకు సాగుకు అయ్యే మదుపు లెక్కించి దానిపై 50శాతం పెంచి ధర నిర్ణయం చేయాల్సివుంది. ఎన్నికలకు ముందు ప్రధాన నరేంద్రమోడీ కూడా ఇదే పద్ధతిలో మద్ధతు ధర చెల్లిస్తామని ప్రకటన చేశారు. ఈలెక్కన టన్ను చెరకుకు రూ.5వేల చొప్పున చెల్లించాల్సి వుందని ఎపి రైతు సంఘం డిమాండ్ చేస్తోంది. కేంద్రం దీన్ని అమలు చేయలేదు సరికదా మద్ధతు ధర నిర్ణయించడానికి ప్రాతిపదికగావున్న రికవరీ శాతాన్ని 9.5 నుంచి 10.5శాతానికి పెంచింది.

మన రాష్ట్రంలో చెరకు పరిశోధనలు ఏళ్ల తరబడి ముందుకు సాగడం లేదు. ఫలితంగా కొత్త రకం విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో ఇప్పటికీ 10ఏళ్ల నాటి విత్తనాలనే ఉపయోగించడం వల్ల దిగుబడి దిగుబడి ఎకరాకు 20టన్నుల నుంచి అత్యధికంగా 40టన్నులకు మించి రావడం లేదు. రికవరీ రేటు కూడా మన రాష్ట్రంలో 9.5శాతానికి మించి రావడం లేదు. దీంతో, చెరకు రైతులు ధర విషయంలో తీవ్రంగా నష్టపోతున్నారు. క్వింటాకు రూ.10 పెంపు అనేది ఏటా పెంచుతున్నదేనని, దానికి ఎలాంటి కొలబద్దా లేదని రైతు సంఘం నాయకులు చెబుతున్నారు.

నాలుగేళ్లలో మారిన రూపురేఖలు

- పూర్తిస్థాయి పట్టణీకరణవైపు పరుగులు
- శంకుస్థాపన మాసోత్సవంలో మంత్రి బొత్స
- రూ.10.15 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత... ఈ నాలుగేళ్ల పాలనలో విజయనగరం జిల్లా కేంద్రం రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. గతంలో ఎవరూ చేయలేనన్ని పనులు చేపట్టి నగరానికి నూతన శోభ తీసుకొచ్చామని గుర్తు చేశారు. అనేక అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి స్థాయి పట్టణీకరణకు అనేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, కార్పొరేషన్ పాలక వర్గ సభ్యులు, అధికారులు ప్రశంసనీయ పాత్ర పోషించారని కితాబిచ్చారు.రూ.10.15 కోట్ల అంచనాతో నగరంలో చేపట్టబోయే 116 పనులకు సంబంధించిన మాసోత్సవ శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఎంఆర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కార్పొరేషన్ పాలక వర్గ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. తాజాగా రూ.10.15 కోట్లతో నగరంలో 116 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని.. నిరంతర ప్రక్రియ విధానంలో నెల రోజుల పాటు సంబంధిత పనులు జరుగుతాయని పేర్కొన్నారు. నగరంలో ఉన్న ప్రధాన రహదారులు, వీధుల్లో ఉన్న రోడ్లు విస్తరిస్తామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతిపాదించిన పనులు తొమ్మిది ఉన్నాయని వాటికి రూ.29.25 లక్షలు కేటాయించామని మంత్రి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.58 లక్షలు వెచ్చించి రెండు పనులు చేపడుతున్నామని వివరించారు. భవన అభివృద్ధికి సబంధించి రూ.4.21 కోట్లతో 50 పనులు చేయనున్నామని పేర్కొన్నారు. సాధారణ నిధులు రూ.5.06 కోట్లతో మరొక 55 పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని మంత్రి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ అశోక్ గజపతి రాజుని ఉద్దేశించి పరోక్షంగా పలు విమర్శలు చేశారు. నిజం తెలుసుకొని మాట్లాడాలని.. హుందాతనం పాటించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సురేష్ బాబు, రఘురాజు, నగర మేయర్ విజయలక్ష్మి, ఉప మేయర్లు శ్రావణి, లయ, కమిషనర్ శ్రీరాములు నాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రాష్ట్రమంత్రి బొత్స, కోలగట్ల

పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులు మొదలు పెట్టండి

పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా మొదలు పెట్టాలని, సంబంధిత సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసి పనులకు శ్రీకారం చుట్టాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆలయ ఇఒను ఆదేశించారు. ప్రస్తుత ఆలయానికి ఇరువైపులా ఉన్న భవనాలను త్వరగా తొలగించాలని సూచించారు. ఆర్థిక లావాదేవీలు ఇంకా ఏమైనా ఉంటే పూర్తి చేసేయాలని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఆలయ కార్యవర్గ సభ్యులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఇరువైపులా భవనాలు కలిగిన వ్యక్తులతో మంత్రి మాట్లాడారు. అధికారులకు అన్ని విధాలుగా సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. వారి వెంట మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఉప మేయర్లు శ్రావణి, లయ, ఆలయ ఇఒ సుధారాణి తదితరులు ఉన్నారు.

ప్రజలు మరోసారి ఆశీర్వదించాలి

బొండపల్లి: ప్రజలు మరోసారి ఆశీర్వదించి జగన్మోహనరెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. శనివారం గొట్లాంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో జగనన్న ప్రభుత్వం సంక్షేమానికి పేద పీట వేసిందన్నారు. ప్రతి కుటుంబానికి ఆర్థికంగా చేయూతనివ్వాలన్న సంకల్పంతో వైసిపి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నిరంతరం బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం పరి తపిస్తున్న సిఎంను మరోసారి గెలిపించుకో వాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి సురేష్‌బాబు, ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, తహాశీల్దార్ ప్రసాద్ రావు, ఎ ఒపిడిఒ వైబి.రాజేంద్ర ప్రసాద్, ఇఒపిఆర్‌డి సుగుణాకర్ రావు, వైస్ ఎంపిపిలు మీసాల సరోజిని, గొండెల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగు నింపిన వైఎస్

జయంతి వేడుకల్లో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి అని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీలు, ఇతర నేతలతో కలిసి ఆయన శనివారం జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. సిఎంఆర్ జంక్షన్లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాల గురించి వివరించారు. వైఎస్సార్ పాలన మాదిరిగానే పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జగన్ మోహన్ రెడ్డి హయాంలోని ప్రభుత్వం కూడా తీవ్ర కృషి చేస్తోందని గుర్తు చేశారు. ఎప్పటికీ మరువ లేని.. మరెవ్వరు చేయలేని మంచిని ప్రజలకు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, రఘురాజు, మేయర్ విజయలక్ష్మి, ఉప మేయర్లు శ్రావణి, లయ, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి బొత్స, కోలగట్ల తదితరులు

డిసిఎంఎస్ కార్యాలయంలో..

డిసిఎంఎస్ కార్యాలయ ఆవరణంలో వైఎస్ఆర్ చిత్రపటానికి చైర్‌పర్సన్ అవనాపు భావన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వై.ఎస్.రాజశేఖర రెడ్డి తెలుగు ప్రజలకు అందించిన సేవలు అనిర్వచనీయమని అన్నారు. రాజశేఖర రెడ్డి స్వతగా వైద్యులు కావడంతో విద్య, వైద్యం పై ప్రత్యేక దృష్టి సారించారని,108 వంటి అద్భుతాన్ని ఆవిష్కరించారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అవనాపు విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో..

విజయనగరం కోట : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సతీష్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రానికి అనేకమైన సేవలు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక విటి అగ్రహారం 35, 36 డివిజన్ల పరిధిలో వైఎస్ విగ్రహానికి వైసిపి కార్పొరేటర్లు శ్రీనివాసరావు, బాలి బాలకృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

రైతులను నట్టేటముంచిన వైసిపి

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా, పండించిన ధాన్యాన్ని కొనకుండా అనేక ఇబ్బందులకు గురి చేసి నట్టేట ముంచిందని మాజీమంత్రి కిమిడి కళా వెంకటర్రావు అన్నారు. టిడిపి చేపట్టిన శనివారం కోమటిపల్లిలో భవిష్యత్‌కు గ్యారంటీ చైతన్య రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బొబ్బిలి నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి బేబినాయన అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళా వెంకటరావు మాట్లాడారు. ఒక్క అవకాశం ఇస్తే మీ బతుకులు మార్చేస్తానని, సన్న బియ్యం ఇస్తానని, రైతు సాధికారిత చేస్తానని ముఖ్యమంత్రి జగన్ నమ్మబలికి పాద యాత్రలో ముద్దులు ఇచ్చి ఇప్పుడు గుద్దులు గుద్దుతున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో 63 శాతం మంది రైతులు పూర్తి గా నష్టాల్లో వున్నారని, ఈ ప్రభుత్వ పాలన వల్ల 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లి పోయిందని అన్నారు. బటన్ నొక్కడం తప్ప పరిపాలన లేదని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో మళ్లీ టిడిపి అధికారం లోకి వస్తే భవిష్యత్తు గ్యారంటీ పథకాలతో పాటు ఇప్పుడున్న పథకాలన్నీ కొనసాగిస్తామని తెలిపారు. మాజీ స్పీకర్ ప్రతిభా భారతి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరాచకాలు, మహిళలపై అత్యాచారాలు పెరిగి పోయా యన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున, తెంటు లక్ష్మునాయుడు, బేబినాయన, మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కెఎ నాయుడు, ఆర్‌పి భంజ్‌దేవ్, బి.చిరంజీవులు, కోళ్ల లలితకుమారి, అనకాపల్లి పార్లమెంట్ ఇంచార్జి బొద్దా నాగేశ్వర్రావు, కిమిడి రామ్ మల్లిక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

టిడిపి చైతన్య రథయాత్రలో కళా వెంకటరావు

సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు

టిడ్కో ఇళ్లు, , అన్న కేంటిన్ వెంటనే ప్రారంభించాలి

పేదలకు అనుకూలమైన టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదార్లకు అందజేయాలని టిడిపి నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం లో పాల్గొన్న టిడిపి నాయకులు టిడ్కో ఇళ్ల ను సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వంలో 70శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు ఈ ప్రభుత్వం కావాలనే నిలుపుదల చేసిందన్నారు. వెంటనే మిగిలిన పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. లేని పక్షంలో తమ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే పనులు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయిస్తామన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం నాశనం

రామభద్రపురం : వైసిపిపాలనలో రాష్ట్రం నాశనమైందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. చైతన్యరథ యాత్రలో భాగంగా మూడురోడ్ల జంక్షన్‌లోజరిగిన సభలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టేలా, చంద్రన్న ముఖ్యమంత్రి అయ్యేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. రాబోయే ఎన్నికల మేనిఫెస్టో వివరించారు. అనంతరం మండలం లో నెలకొన్న సమస్యలు,అసంపూర్తిగా మిగిలిన అభివృద్ధి పనులు పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో గుర్తించి సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో నాయకులు తెంటు లక్ష్మునాయుడు, కిమిడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గౌరును పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

గ్రీన్ అంబాసిడర్ కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రామభద్రపురం మండలం ఆరిక తోటలో ఆత్మహత్య చేసుకున్న గ్రీన్ అంబాసిడర్ వర్రి గౌరు కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం కింద రూ.10లక్షలు చెల్లించి ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, విజయనగరం అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్‌రావు, బి.రమణ డిమాండ్ చేశారు. ఇది ప్రభుత్వ హత్యేనని అన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌరును పరామర్శించారు. అయితే కొద్దిసేపటి తరువాత పరిస్థితి విషమించి గౌరు మృతి చెందాడు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాలను పరిశు భ్రంగా ఉంచుతున్న గ్రీన్ అంబాసిడర్లకు పది నెలలుగా వేతనం ఇవ్వకపోవడం వలన అప్పుల పాలై ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే గౌరు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్పంచ్‌లకు అప్పజెప్పకుండా ప్రభుత్వమే బకాయిలో ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలని, అతని భార్య పార్వతికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇటువంటి ఘటనలకు ప్రభుత్వం అవకాశం ఇవ్వకుండా జిల్లాలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్స్ అందరికీ బకాయి జీతాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

324 మంది రైతులకు పరిహారం అందజేత

ప్రజాశక్తి-విజయనగరం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేశామనిరాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో వ్యవసాయ అనుబంధ శాఖలు శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి బొత్స ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం సభ నుంచి ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం జిల్లాకు చెందిన 324 మంది రైతులకు రూ.50,14,290 విలువ గల చెక్కును మంత్రి బొత్స, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నూతన అధ్యాయంగా పేర్కొనే రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు వెలకట్టలేని సేవలు అందిస్తున్నామని గుర్తు చేశారు. ఎరువులు, విత్తనాలకు కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రాపింగ్ విధానం ద్వారా అర్హత కలిగిన ప్రతి రైతుకూ ఆర్థిక పరమైన సాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు సురేష్ బాబు, రఘురాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిసిఎంఎస్ చైర్మన్ అలనాపు భావన, డిసిసిబి అధ్యక్షులు చినరాము నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసం ఒకరు... ఉలికిపాటుతో మరొకరు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ప్రతిపక్షం ఉనికి కోసం పాకులాడుతుండగా.... ఆ చర్యలకు అధికార పక్షం ఉలికిపాటుకు గురౌతోంది. తాజా పరిణామాలను ఇందుకు భేరీజు వేస్తున్నారు జనం. భవిష్యత్తు గ్యారెంటీ పేరిట టిడిపి రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన బస్సు యాత్ర నియోజకవర్గాలవారీగా సాగుతున్న విషయం విధితమే. ఈనెల 4వ తేదీన జిల్లాకు చేరిన బస్సులో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయ కర్త బుద్దా వెంకటన్న నాయకత్వంలో విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నాయకులు యాత్రచేపట్టిన విషయం విధితమే. ముఖ్యంగా విజయనగరంలో చేపట్టిన బస్సుయాత్ర ముమ్మాటికీ ఉనికి కోసమేనని పబ్లిక్ టాక్. బస్సుయాత్రలో సందర్శించిన స్థలాలు, సమస్యలతోపాటు భవిష్యత్తు గ్యారెంటీ అన్న అంశంపైనా జనం విమర్శనస్త్రాలు సంధిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. టిడిపి ప్రతిపక్షంలోకి వచ్చి నాలుగేళ్లు దాటింది. వైసిపి చెప్పిన మద్యపాన నిషేధం అమలు చేయలేదు సరికదా.. ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. వీటిపై అడపాదడపా ప్రెస్‌మీట్లలోనో లేక ఆడియో క్లిప్పింగుల్లోనూ తప్ప గట్టిపోరాటం చేసిన దాఖలాలు లేవు. కానీ, కెఎల్‌పురంలో వున్న సర్కారువారి మద్యం దుకాణాన్ని ఊరు అవతలకు మార్చడాన్ని తప్పుపడుతూ హడావుడి చేయడం పట్ల చాలా మంది నవ్వుతున్నారు. మరీ ముఖ్యంగా సోనియానగర్, సారిపల్లిలో టిడ్కో ఇళ్ల నిర్మాణం తమ హయాంలోనే 80శాతం పూర్తిచేశామని టిడిపి నాయకులు చెబుతున్నారు. కొన్నాళ్ల క్రితం వరకు తామే నిర్మాణ పనులు పూర్తిచేశామని కూడా చెప్పారు. ఆ మాటకొస్తే లబ్ధిదారులకు కేటాయింపులు కూడా చేశారు. ఆ తరువాత ఇళ్లు అప్పగించకపోవడంతో గడిచిన ఎన్నికల్లో లబ్ధిదారులు టిడిపిని ఇంటికి పంపారు. విజయనగరంలో టిడిపి ఓటమికి ఇది కూడా ఒక కారణమని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. అవకాశం ఉన్నప్పుడు ప్రజలకు అప్పజెప్పేందుకు ముందుకు రాని టిడిపి, రానున్న ఎన్నికల కోసం రాజకీయాలు చేస్తుందని పలువురి విమర్శ. గురజాడ అప్పారావు స్వగృహాన్ని సాహితీ కేంద్రంగా

అభివృద్ధిచేయాలని చాలా కాలంగా కవులు, రచయితలు, సాహితీ ప్రియులు, పట్టణ పుర ప్రముఖులు కోరుతున్న విషయం విధితమే. అధికారంలో ఉన్నన్నాళ్లు పెడచెవిన పెట్టి తాజాగా బస్సుయాత్రలో గురజాడపై భక్తిని ప్రదర్శించారు. ఇక పెద్దచెరువుతోపాటు విజయనగరం కోట అభివృద్ధికి టిడిపి హయాంలో రూ.కోట్లు మంజూరయ్యాయి. దుర్వినియోగమైనట్టు విమర్శలు కూడా వినిపించాయి. వాటి అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ కీలకమైన అభివృద్ధి పనులను పూర్తిచేయడంలో టిడిపి విఫలమైంది. అధికారంలోకి వచ్చాకైనా వాటికోసం ప్రభుత్వాన్ని నిలదీయలేదు. దీంతో, ప్రస్తుతం చేపడుతున్న భరోసా గ్యారెంటీ పేరిట చేపట్టిన బస్సు రథయాత్ర కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమేనని ప్రజలు చర్చించుకుంటున్నారు. చిత్తశుద్ధి ఉంటే గడిచిన నాలుగేళ్లలో ఎందుకు ప్రశ్నించడం లేదని పలువురువ వాదిస్తున్నారు.

ఇక వైసిపి పరిస్థితికి వస్తే టిడిపి చేపట్టిన బస్సుయాత్రకు ఉలికిపాటుకు గురికావడం తప్ప, వారు అడుగుతున్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు చెప్పలేకపోతోంది. ముఖ్యంగా టిడ్కో ఇళ్లు ఇవిగో అవుగో అంటూనే నాలుగేళ్లు గడిపేశారు. ఈ నేపథ్యంలో టిడిపికి, వైసిపికి తేడా ఏమిటని జనం ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులకు నాడు చంద్రబాబు ఇచ్చిన పత్రాలను రద్దుచేసి, వాటి స్థానంలో జగన్మోహన్‌రెడ్డి బొమ్మతో కూడిన పత్రాలు ఇవ్వడం తప్ప ఇళ్లు అప్పగించిన పాపాన పోలేదన్న ఆవేదన వ్యక్తమౌతోంది. టిడిపిపై స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల ఎదురుదాడి చేసే బదులు పెద్దచెరువును, అక్కడ తలపెట్టిన ట్రీట్‌మెంట్ ప్లాంటును ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారో చెబితే బాగుంటుందని చాలా మంది చర్చించుకుంటున్నారు. టిడిపి నాయకులు చేసిన ఆరోపణలకు తగ్గట్టే జెఎన్‌టియు కొండపై అప్పట్లో టిడిపి ప్రభుత్వం ఏర్పాటుచేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను గాలికి వదిలేసింది. నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజాధనం నిరుపయోగం కావడంతోపాటు విద్యుత్ అవసరాలను తీర్చుకోలేని దుస్థితి ఏర్పడింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత డ్రిప్ ఇరిగేషన్ కూడా పట్టించుకోలేదు. వీటిపై ఎమ్మెల్యే సమాధానం చెప్పడానికి బదులు ఉనికి కోసమే ఇదంతా చేస్తున్నారని బుకాయించడం ప్రజలు గమనిస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కేవలం ఉనికి చాటుకోవడానికి, ఉలికిపడి కాకుండా ప్రజలకు చిత్తశుద్ధితో సేవలందిస్తే ప్రజలు గుర్తిస్తారని పలువురు హితవు పలుకుతున్నారు.

ఎన్ఇపి అభివృద్ధికి సాధనం : విసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ విద్యా విధానం దేశ అభివృద్ధికి సాధనమని గిరిజన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ తేజస్వి కట్టమని అన్నారు. శనివారం గిరిజన విశ్వ విద్యాలయం లో జరిగిన ఎన్ఇపి 2020పై ఆయన మాట్లాడారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్ట దానికి, మాతృభాష వినియోగం పెంచేందుకు , విద్యార్థులను ప్రయోజకులను చెయ్యడానికి జాతీయ విద్యా విధానం ఉపయోగ పడుతుందని అన్నారు. విశ్వ విద్యాలయ భూమి అప్పగింత జరిగిందని, త్వరలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యా వ్యవహారాల మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ల చేతులమీదుగా శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. అనంతరం ఫోర్ట్ సిటీ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రహనేఖాన్ మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్య బలోపేతం కావలసి ఉందని అన్నారు. సత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టం. మజ్జి శశిభూషణ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి కల్పించే విధంగా తయారు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్ వి ఎస్ సూర్యనారాయణ, డాక్టర్ తారకేశ్వర రావు పాల్గొన్నారు.

జలాసనాలను తిలకిద్దాం రండి!

విజయనగరం టౌన్ : ఈనెల 11న జాతీయ స్విమ్మింగ్ పూల్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆక్వా స్విమ్మింగ్ పూల్ లో ఉదయం 8.30గంటల నుంచి గంటపాటు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జలాసన ప్రదర్శన చేపడుతున్నారనిని, ప్రజలంతా వచ్చి తిలకించాలని వైసిపి యువజన విద్యార్థి, విభాగం నాయకులు కోరారు. శనివారం కంటోన్మెంట్ లోని ఆక్వా స్విమ్మింగ్ పూల్ వద్ద యువజన విభాగం సీనియర్ నాయకులు జి.ఈశ్వర్ కౌశిక్, జిల్లా అధ్యక్షులు సంగంరెడ్డి బంగారు నాయుడు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తరలివచ్చి కోలగట్ల చేస్తున్న ప్రయత్నానికి ప్రోత్సాహం అందించాలని కోరారు.

అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్‌కు శరణ్య

కార్తీక శరణ్య

భోగాపురం : విమానాశ్రయం నిర్వాసిత గ్రామమైన బొల్లింకల పాలెంకు చెందిన బొల్లెంకుల కార్తీక శరణ్య అంతర్జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైంది. ఆగస్టు18 నుండి 22 వరకు ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్‌లో జరుగు పోటీలలో శరణ్య పాల్గొంటారు. ఇటీవల చండీగఢ్ మొహలీలో జరిగిన సెలక్షన్‌లో పాల్గొని అంతర్జాతీయ పోటీలో చోటు దక్కించుకుంది. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో 30 పతకాలు సాధించింది. మండలంలోని పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం కోచ్‌లు సత్యనారాయణ, చిట్టిబాబు దగ్గర శిక్షణ పొందుతుందని తల్లి దండ్రులు అప్పన్నరెడ్డి, రత్న కుమారి తెలిపారు. శరణ్యకు స్కేటింగ్ పట్ల ఉన్నా ఆసక్తిని గుర్తించి తర్ఫీదునిచ్చామన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

గంట్యాడ: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మండల టిడిపి అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన మండల పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలోని టిడిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి ప్రతి ఒక్కరూ ప్రజల వద్దకు వెళ్లి వివరించాలన్నారు. ప్రతి గ్రామంలోని ఓట్లు చేర్పులు మార్పులు గురించి తెలుసుకోవాలన్నారు. సంబంధిత బిఎల్‌ఓలను కలిసి ఓటరు జాబితా గురించి వివరాలు అడిగి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ అరాచక పాలన గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు బడుగు బలహీన వర్గాల మహిళలకు అందించిన పథకాలు గురించి వివరించాలన్నారు. రానున్న ఎన్నికలలో టిడిపిని గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ కార్యదర్శి అల్లు విజయకుమార్, సీనియర్ నాయకులు రొంగళి కృష్ణ, బూడి అప్పలనాయుడు, రండి చినరామనాయుడు, సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు ట్రెక్కింగ్ క్యాంప్

నెల్లిమర్ల: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో భాగంగా శనివారం శ్రీ ఆదిత్య విద్యాలయం స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను సారిపల్లి ఇండస్ట్రియల్ ప్రాంతం ఉన్న అతి పురాతమైన దిబ్బేశ్వర శివాలయాన్ని, రవివర్మ ఎథిక్స్ ఆయుర్వేదిక్ విలేజ్, నగరవనం సందర్శించి అక్కడి నుంచి విద్యార్థులను ట్రెక్కింగ్ క్యాంపు నిర్వహించారు. సారిపల్లి అనంతరం ఇండస్ట్రియల్ ఏరియాలో వాటర్ ప్లాంట్ నిర్వహణ, ఐరన్ మెస్ తయారయ్యే విధానాన్ని విద్యార్థులు పరిశీలించారు. నెల్లిమర్ల నగర పంచాయతీలోని వెంకట చలపతి ఆలయాన్ని సందర్శించారు. బృందావనం వ్యాలీలో ఔషధ మొక్కల ఉపయోగాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హెచ్ డబ్ల్యు స్కౌట్ మాస్టర్ వి సూరిబాబు, హెచ్‌ఎం వి.అమృత, సహ ఉపాధ్యాయులు కబీర్ బి.సంతోషికుమారి అప్పలనాయుడు, రాజారావు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణ

డెంకాడ: స్థానిక ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గత వారం రోజులుగా నిర్వహించిన ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఎపిఎస్‌సిహెచ్ఇ, ఎపి డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా వారం రోజులు పాటు డిజిటల్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్‌లో భాగంగా 1200 ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్లు, ఆండ్రాయిడ్ బాక్స్‌పై బైజూ కంటెంట్‌తో శిక్షణ ఇచ్చారు. ఎంవిజిఆర్‌లో వివిధ విభాగాల నుండి మొత్తం 19 మంది అధ్యాపకులు ఈశిక్షణలో పాల్గొని ఉపాధ్యాయులకు డిజిటల్ శిక్షణ ఇచ్చారు. తరగతి గది బోధనా అభ్యాస ప్రక్రియలో డిజిటల్ సాధనాల ప్రాముఖ్యతను వివరించారు.

అభివృద్ధి పై బహిరంగ చర్చకు సిద్ధం

ప్రజాశక్తి - మెరకముడిదాం

గత టిడిపి ప్రభుత్వంలో మెరక ముడిదాం మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు పై బహిరంగ చర్చకు మండల టిడిపి నాయకులు సిద్ధంగా ఉన్నామని, వైసిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పై చర్చించుకు మీరు సిద్ధామా అని టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండల కేంద్రంలో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. టిడిపి హయాంలో మండలంలో నిర్మించిన ఇళ్ల నిర్మాణం, గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం, సిసి రోడ్లు, కాలువలు, పాఠశాలల ప్రహరీ గోడలు, అంగన్వాడీ భవనాలు నిర్మాణం, స్మశానా వాటికలు అభివృద్ధి, నీళ్ల ట్యాంక్‌లు నిర్మాణం, ఇరిగేషన్ ట్యాంక్‌ల పనులు, గ్రావెల్ రోడ్ల పనులు చేశామని ఈ పనులపై తాము చర్చకు సిద్ధమన్నారు. మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పగలరా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎం. రమణ మోహనరావు, కె. ధనంజయ, టి.శ్రీధర్, పాల్గొన్నారు.

చిన్నారి హిమంజలి నటన ప్రశంసనీయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చిన్నారి హిమాంజలి నటన ప్రశంసనీయమని పట్టణానికి చెందిన డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు మున్నా మైకెల్ పేర్కొన్నారు. జీ తెలుగు ఛానల్ డ్రామా జూనియర్స్ సీజన్ సిక్స్ లో మూడు పతకాలను సాధించిన విజయనగరం చిన్నారి పి. హిమాంజలిని శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా మున్నా మాట్లాడుతూ చిరుప్రాయంలోనే నటనలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి చిన్నారి హిమాంజలి విజయనగరానికి కీర్తిని తెచ్చిందని పేర్కొన్నారు. సినీ అగ్రనటులు బాబు మోహన్, జయప్రద వంటి వారు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్న ఈ కార్యక్రమంలో వారి నుంచి ప్రశంసలు అందుకోవడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో హిమాంజలి అగ్ర నటిగా తయారవుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిన్నారి హిమాంజలి తల్లిదండ్రులు రవిచంద్రరావు , పద్మజ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రహ'దారుణాలు'

- పూర్తిగా శిథిలావస్థకు చేరిన రోడ్లు
- కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి
- చినుకపడితే చెరువులను తలపించే రహదారులతో అవస్థలు

మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. కొన్ని రహదారుల్లో కాలి నడకన కూడా నడవలేని పరిస్థితిలో రహదారులున్నాయి. ఇంకొన్ని గ్రామాల్లో రహదారులు వర్షం పడితే చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని చోట్ల మెటల్ వేసి వదిలేయడం వల్ల రాళ్లు తేలి ప్రయాణం కష్టమవుతోంది. నాలుగేళ్లవుతున్నా ప్రభుత్వం రహదారులపై దృష్టిపెట్టకపోవడంతో ప్రజలు నరక యాతన పడుతున్నారు.

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవ నుంచి ఆనందపురం, వేపాడ మీదుగా సోంపురం జంక్షన్‌కు వెళ్లే ప్రధాన రహదారి శిథిలావస్థకు చేరింది. 2011లో ఎపి పంచాయతీరాజ్, ప్రధానమంత్రి గ్రామీణ యోజనపథకం కింద ఈ రహదారిని రూ.97.75 లక్షలతో నిర్మించారు. ప్రస్తుతం ఆ రోడ్డు కాలినడకన కూడా వెళ్లడానికి వీలు లేకుండా అడుగడుగునా గోతులు, ప్రమాదకరంగా కోతకు గురైంది. మధుము, మలుపులు వద్ద రోడ్డు భారీగా ప్రమాదకరంగా వర్షాలకు పాడైపోవడం వల్ల విద్యార్థులు నిత్యం పాఠశాలకు వెళ్లే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో అనారోగ్యానికి గురైన వారిని ఈ రహదారి గుండా సకాలంలో ఆస్పత్రికి తరలించలేని పరిస్థితి కనిపిస్తోంది.

పట్టించుకోని ఆర్‌అండ్‌బి అధికారులు

సోంపురం జంక్షన్ నుండి వేపాడ మీదుగా ఆనందపురం జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులకు సుమారు రూ.39 కోట్లు నిధులు మంజూరయ్యాయి. విస్తరణ పేరిట వల్లంపూడి నాయుడు ఫోటో స్టూడియో నుండి వేపాడ మలుపు గుళ్ళపల్లి వారి ఇంటి వరకూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లను కూల్చివేశారు. ఇళ్లను కూల్చివేసిన తరువాత రోడ్డు పనులు చేపట్టకపోవడంతో రోడ్డు గుంతల్లో వర్షపు నీరు చేరింది. దీంతో రోడ్డు సరిగా కనిపించక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారి గుండా ప్రతి రోజూ వందలాది వాహనాలు, పాఠశాల, కళాశాల బస్సులు తిరుగుతుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు.

బూడిది రంగులోకి మారిపోయిన దొంగాడ రోడ్డు

గిరిజన గ్రామాలపై చిన్నచూపు

రహదారుల విషయంలో ప్రభుత్వం గిరిజన గ్రామాలపై చిన్నచూపు చూస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేజీపూడి పంచాయతీ నుండి రెండు కిలోమీటర్లు సారవారిపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కరకవలస పంచాయతీ మారిక గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మాణం పనుల మధ్యలోనే ఆపివేశారు. దీంతో మారిక గిరిజనులు జగ్గయ్యపేట నుండి కొత్త సింగరాయ గ్రామం అయ్యప్ప టెంపుల్ వరకు 1.5 కిలోమీటర్లు రోడ్డును గ్రామస్తులే శ్రమదారంతో బాగు చేసుకున్నారు. కొంపల్లి గ్రామ సచివాలయం పరిధిలో దొగ్గపేట మీదుగా నరసన్నపేట వరకు 1.5 కిలోమీటర్ల రోడ్డు రాళ్లు తేలిపోవడంతో ప్రయాణం నకంగా మారింది. జాకేరు నుంచి రామస్వామి పేట రోడ్డు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మట్టిరోడ్డు నిర్మాణానికి కూడా ఈ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఆతవ జంక్షన్ నుండి గ్రామంలోకి 2 కిలోమీటర్లు పైగా రోడ్డు అంతా పెచ్చులూడిపోయి ప్రమాదకరమైన రోడ్డుకు ఆనుకొని రంధ్రాలు ఏర్పడడం వల్ల ఈ రోడ్డు వెంబడి ప్రయాణించడానికి ఆ గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు పలుమార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. వీలుపరితి రోడ్డు మలుపు వద్ద నుండి కడకొండకు వెళ్లే రోడ్డు క్వారీ లారీలు అధిక లోడులతో రవాణా చేయడం వల్ల రోడ్డు బూడిదగా మారిపోయి భారీగా గుంతలు ఏర్పడి కాలినడకను కూడా వెళ్లలేనంతగా తయారైంది.

వల్లంపూడి, వేపాడ రహదారి పరిస్థితి ఇదీ..

జాకేరు రోడ్డుకు మోక్షం లేదా.?

మండలంలోని జాకేరు రోడ్డుకు ఎప్పుడు మోక్షం కల్పిస్తారని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఆ గ్రామం నుంచి రామస్వామి పేట రహదారికి గతంలో రెండు కిలోమీటర్లు మెటల్ రోడ్డు వేసి వదిలేశారు. తరువాత తారు వేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా గోతులమయమైంది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో ఎస్‌కోట చేరుకోవాలంటే ఈ రోడ్డు చాలా దగ్గరగా ఉంటుంది. ఈ రోడ్డు ప్రస్తుతం మరమ్మతులకు గురికావడంతో అత్యవసర సమయాల్లో ఎస్.కోట వెళ్లాలంటే సోంపురం మీదుగా వెళ్లాల్సి వస్తోందని అదనంగా మరో ఆరు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేసి బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

1 నుంచి మహిళల పోరుయాత్ర

ప్రజాశక్తి - బొబ్బిలి

దేశంలో, రాష్ట్రంలోనూ చిన్నారులు, మహిళలపై హింస రోజు రోజుకూ విపరీతంగా పెరుగుతుందని, మహిళా క్రీడాకారులు ఢిల్లీలో చేసిన ఆందోళన ఇందుకు నిదర్శనమని ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. విజయ గౌరి అన్నారు. శనివారం స్థానిక వేణుగోపాల్ స్వామి ఆలయ కళ్యాణ మండపం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో దేశంలో, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఆగస్టు 1 నుంచి పోరుయాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పోరు యాత్ర కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ పోరు యాత్రలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కె పుణ్యవతి, ఎ. రోజా, పార్వతి, లతా, పుష్ప రామలక్ష్మి, మీసాల లక్ష్మి మహిళలు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక జెడ్‌పి స్కూల్‌లో వివిధ మహిళా సంఘాల ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రవణమ్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత సమాజంలో స్త్రీలను రెండవ స్థాయి వ్యక్తులుగా, లైంగిక వస్తువులుగా మనువాద బిజెపి భావిస్తోందని, పోక్సో చట్టాన్ని ఎత్తివేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. గతంలో మహిళలపై ఆంక్షలు విధించి అణిచివేతకు గురిచేసిన మనువాద సిద్ధాంతాన్ని తిరిగి సమాజంపై, మహిళలపై బలవంతంగా రుద్దుతున్నారన్నారు. ఈ దుర్మార్గమైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఆగస్టు1 న రామభద్రాపురం వస్తున్న పోరు యాత్రను మహిళలందరూ జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అరుణ, కుమారి, శ్యామల, కుమారి,లక్ష్మి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న ఐద్వా, ప్రజాసంఘాల నాయకులు

అగ్రి ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - బొబ్బిలి

వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా రైతు దినోత్సవం జరుపుకుంటున్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. శనివారం రాష్ట్ర రైతు దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కళ్యాణ దుర్గంలో 52 అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించగా బొబ్బిలి పట్టణంలో రూ.68.4లక్షలతో నూతనంగా నిర్మించిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, ఎంపిపి శంబంగి లక్ష్మీ, వైసిపి మండల అధ్యక్షులు వేణుగోపాలనాయుడు, వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, గొలగాన రమాదేవి, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, బాడంగి జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి, వార్డు కౌన్సిలర్లు, మండల జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, పశుసంవర్ధక శాఖ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: కొత్తవలసలో సుమారు రూ.67 లక్షలతో నిర్మించిన వైయస్సార్ అగ్రి ల్యాబ్‌ను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వ్యవసాయ రంగానికి సంబంధించి అగ్రి ల్యాబ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఏ సమయంలో, ఏ కాలంలో, ఏ పంట వేయాలో వ్యవసాయ క్యాలెండర్ బట్టి తెలుస్తుందన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులకు సరైన మార్గదర్శకాలు ఇవ్వడానికి ల్యాబ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. విత్తన శుద్ధి ఏ విధంగా చేసుకోవాలో ల్యాబ్ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులుగొరపల్లి శివ, వైస్ ఎంపిపి కర్రీ శీను, మేలాస్త్రి అప్పారావు, కొత్తవలస వ్యవసాయ శాఖ ఎడిఎ ఎల్. విజయ, వెటర్నరీ ఏడి గంగాధర్, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగశాల ప్రారంభం

ప్రజాశక్తి - గజపతినగరం

మండల కేంద్రంలో సుమారు రూ.16లక్షల వ్యయంతో నిర్మించిన పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు పశువ్యాధి నిర్ధారణ ల్యాబ్‌లు జిల్లా కేంద్రాల్లో ఉండేవని, పాడి రైతులకు పశువైద్యం అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ప్రతి నియోజకవర్గ కేంద్రంలోనూ పశువ్యాధి నిర్ధారణ ల్యాబ్‌లు అందుబాటులోకి తెచ్చారని అన్నారు. పశు వైద్యులు పాడి రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ పాడి సంపద అభివృద్ధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సామంతుల పైడిరాజు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, స్థానిక నాయకులు బెల్లాన త్రినాధరావు, కరణం ఆదినారాయణ, ఉపసంచాలకులు డాక్టర్ వై.వి. రమణ, సహాయ సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ రెడ్డి కృష్ణ, డాక్టర్ శశి భూషణ్, డాక్టర్ రమణ, పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొత్స

గోకులాల బిల్లులు తక్షణమే చెల్లించండి

ప్రజాశక్తి- వేపాడ

రైతు నిర్మించుకున్న మినీ గోకులాలకు నాలుగేళ్లు పూర్తి కావస్తున్న బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమని వెంటనే బిల్లులు మంజూరు చేయాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. గోకులాల నిర్మించి నష్టపోయిన రైతులతో ఈ నెల 10 కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. శనివారం కొండగంగుపూడిలోని రైతులతో ఆయన మాట్లాడారు. మినీ గోగులాలు నిర్మించండని చెప్పిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గానీ, నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గాని సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు అన్యాయానికి గురయ్యారన్నారు. 6 పశువుల షెడ్లకు రూ.1.8 లక్షలు, 4 పశువుల షెడ్లకు రూ.1.2 లక్షలు పేమెంట్ ఇస్తామని రైతులతో చెప్పి షెడ్లు నిర్మించిన తరువాత బిల్లులు చెల్లించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసేందుకు వ్యక్తిగత దరఖాస్తులతో ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ వద్దకుహాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిడతన పరదేశి నాయుడు, రైతులు అప్పలనాయుడు, మమ్ములూరి ఈశ్వరరావు, గొల్లు చంద్రరావు, కిలపర్తి సత్తిబాబు, గొళ్ళు ఎర్రన్న, రొంగలి రామారావు తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు చల్లా జగన్

వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని పలు గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి వైసిపి నాయకులు ఆవు సత్యనారాయణ, జడ్‌పిటిసి రామారావు, ఎంపిపి బోగి గౌరి, ట్రైకర్ డైరెక్టర్ పారది చిన్నపుదొర, జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకర్ రావు, తెంటు మధు సుధన్, రెడ్డి కృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు.

బొబ్బిలి : వైఎస్ఆర్ 74వ జయంతి సందర్భంగా శనివారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పట్టణంలో అమ్మిగారి కోనేరు వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు చిన్నారులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భారీ కేకును ఎమ్మెల్యే కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి, బుడా చైర్మన్ ఇంటి పార్వతి, గోపాలరావు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, తూముల భాస్కరరావు, కౌన్సిలర్లు, మండల జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, కో ఆప్షన్ సభ్యులు, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మి అప్పలనాయుడు, వంగపండు శ్రీరాములు నాయుడు, పాల్గొన్నారు. గొల్లపల్లి గ్రామంలో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు పూలమాలవేసి నివాళు లర్పించారు.

గంట్యాడ: మండలంలోని కొటారుబిల్లి జంక్షన్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, నాయకులు నారాయణమూర్తి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్‌కుమార్‌లు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గంట్యాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు రండి రాము, కొండ తామరపల్లి సర్పంచ్ కోడెల ముత్యాల నాయుడు, మురిపాక సర్పంచ్ రమేష్, మదనాపురం సర్పంచ్ అప్పారావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రంలో అన్నదానం

నెల్లిమర్ల: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేశ్ బాబు వృద్ధులకు అన్నదానం చేశారు. శని వారం విజయనగరంలో బాబా మెట్టలో వెలుగు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆయన అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు అవసరమైన నిత్యాసర వస్తువులను నిర్వాహకులకు అందజేశారు.

మెరకముడిదాం: సంక్షేమ పథకాలను ప్రజలకు చేర వేస్తూ, పేద, బడుగు, బలహీన వర్గాలలో చెరగని ముద్ర వేసు కొని, తెలుగు వారి గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకొన్న మహోన్నత వ్యక్తి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి అని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి జయంతిలో భాగంగా మండల కేంద్రంలో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణ రాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల వెంకటరావు, వైస్ ఎంపిపి తల చుట్ల హరిబాబు, పప్పల క్రిష్ణ మూర్తి, బూర్లె నరేష్ కుమార్, సరిది రమేష్, కె. నాగేశ్వరావు, పలువురు పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎంపిపి డి. సత్యవంతుడు పూలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పేదలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎస్ అప్పలనాయుడు, హ్యూమన్ రైట్స్ మెంబర్ సిహెచ్ పద్మావతి, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, వేపాడ సర్పంచ్ ఎం అర్జునమ్మ, ఎంపిటిసి జి గంగతల్లి, వైసిపి మండల అధ్యక్షులు ఎం. జగ్గు నాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎస్ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: స్థానిక వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిటిసిలు, నాయకులు బెల్లాన త్రినాధరావు, మండల సురేష్, బూడి వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: వైఎస్ఆర్ జయంతి సందర్భంగా జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి తన స్వగ్రామం గొల్లలపేటలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నెల్లిమర్ల: అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

మెరకముడిదాం: మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం : పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న స్వాతీరాణి

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

జొన్నవలసకు చెందిన కిడ్నీ బాధితుడు అట్టాడ రవితేజకు జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, సర్పంచ్ కంది రమాదేవి, వైసిపి గ్రామ అధ్యక్షులు కంది గణపతి తదితరులు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. రవితేజ ఇటీవల కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేసుకున్నారు. దాతలు ఇచ్చిన ఆర్థిక సాయంతో ఆపరేషన్ కూడా విజయవంతమైంది. ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడటంతో తమ వంతు గా ఆర్థిక సాయం అందించినట్లు జెడ్‌పిటిసి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామ యూత్, ఇతర సభ్యుల నుంచి కూడా కొంత ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తున్న జెడ్‌పిటిసి శ్రీనివాసరావు

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
E.P. 02/2022: O.S. 707/2014

(NOTICE UNDER ORDER 21 RULE 64 C.P.C.)

Between:
Bhogapurapu Kannam Naidu ....Decree Holder
And:
Goljana Satyanarayana...Judgment Debtor
To,
Goljana Satyanarayana S/o Appala Swamy Ex-Branch Post Master Ompilli Village, Bondapalli Mandal, Vizianagaram District.

Whereas the above named Decree Holder-Plaintiff has instituted the E.P. 02/2022 against you for Recovery of E.P. amount. You are hereby summoned to appear in this Court in person or by a pleader, duly instructed and able to answer all material questions relating to the E.P. who shall be able to answer all such questions on the **18th Day of JULY, 2023, at 10-30 A.M.** to answer the claim.

By Order of the Honourable Court

I. RAMESH
Advocate,
K.L.Puram,
Vizianagaram

నేడు మంత్రి బొత్స జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- మెరకముడిదాం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు చీపురుపల్లిలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నామని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని యువత పెద్ద సంఖ్యలో హాజరై రక్త దానం చేయాలన్నారు. పుట్టిన రోజు వేడుకలకు మండల నాయకులు, కార్యకర్తలు అందరు తప్పనిసరిగా హాజరువ్వాలని ఆయన కోరారు.

ప్రమాదంలో జింక మృతి

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని పోలిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఒక జింక రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఎక్కడి నుంచి వచ్చిందో, ఎలా వచ్చిందో తెలియలేదు. పోలిపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడింది. గమనించిన వాహన చోదకులు హుటాహుటిన వెళ్లి సపర్యలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. జింక ప్రాణాలు వదిలింది. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేరాలు ఘోరాలు

గ్రీన్ అంబాసిడర్ మృతి

ప్రజాశక్తి - రామభద్రపురం

ఆరికతోట పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ మామిడి గౌరు(60) సక్రమంగా జీతాలు రావడం లేదని శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆయన శనివారం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రభుత్వం వీరితో పనులు చేయించు కొని సక్రమంగా వేతనాలు ఇవ్వక పోవడం హేయమైన చర్య అని ఇప్పుడు ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని, నష్ట పరిహారం రూ.20 లక్షలు మంజూరు చేయాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను డిమాండ్ చేశారు. మృతుని భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి గ్రామానికి చెందిన నక్కరాజు సురేష్ (32) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయన శుక్రవారం ఉదయం తన తల్లిని బానాది గ్రామం బంధువుల ఇంటికి తీసుకెళ్లి బల్లంకి వస్తుండగా ఎదురుగా వస్తున్న కనితి అప్పారావు ఇతని బైక్‌ను తన బైక్‌తో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సురేష్ గాయాలపాలయ్యాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.